ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 36.5
కనిష్ఠం 22.4
ANDHRAJYOTHY



ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
ప్రాజెక్టుల నీటిమట్టం	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	563.10 (239.6552)	67,183	1800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.40 (3.54)	236.57	139.84
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	151.934 (17.2013)	నిల్	4,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.128 | డ్రెస్ : రూ.191 | స్కిన్‌లెస్ : రూ.215

భువనగిరి @ 230

- మునిసిపాలిటీల స్వచ్ఛ సర్వేక్షణ్-2024 ర్యాంక్‌లు విడుదల
- భువనగిరికి జాతీయస్థాయిలో 230, రాష్ట్రంలో 33వ స్థానం
- ఆగస్టు 15న అందజేయనున్న అవార్డులు



భువనగిరిలో వివరాలు సేకరిస్తున్న స్వచ్ఛ-సర్వేక్షణ్ బృందం సభ్యులు (ఫైల్)

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్- 2024 ర్యాంక్‌లను కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. 12 కేటగిరీలలో 12500 మార్కులకు గాను దేశవ్యాప్త మునిసిపాలిటీల లో జరిగిన పోటీలలో భువనగిరి మునిసిపాలిటీకి 230 జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో 33వ ర్యాంక్ వచ్చింది. అలాగే ర్యాంక్‌ల సాధనలో యాదగిరిగుట్ట ప్రతిభ చూపగా మిగతా నాలుగు మునిసిపాలిటీలు పలు కారణాలతో వెనుకంజ లో ఉన్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందాలు పరిశీలనకు వచ్చినప్పుడు మాత్రమే మెప్మా ఆర్పీలు, స్వయం సహాయక సంఘం సభ్యులు ముగ్గురు పరిశుభ్రత, ఇతర కార్యక్రమాల పేరి ట హడావుడి చేయగా మిగతా రోజుల్లో అం తంత మాత్రంగానే పారిశుధ్యం ఉన్నట్లు ...

- మిగతా 8వ పేజీలో...

ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు షురూ



- మొదటగా ఉన్నత పాఠశాలలు
- రెండో దశలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో
- సుమారు 200 మంది ఉపాధ్యాయుల సర్దుబాటుకు అవకాశాలు

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ జిల్లాలోమొదలైంది. ఉపాధ్యాయులున్న చోట విద్యార్థులు లేక, విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేక ప్రభుత్వ విద్య మిథ్యలా మారింది. దీంతో ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ఉపాధ్యాయుల ఖాళీలు, పాఠశాలల వారీగా సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత లేకుండా చూస్తోంది. ఇందులో భాగంగా ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియను జిల్లా విద్యాశాఖ ప్రారంభించింది.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

జిల్లాలో తొలుత ఉన్నత పాఠశాలలు, అనంతరం ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్దుబాటు ప్రక్రియను చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల సర్దుబాటు డీఈవో కార్యాలయం పరిధిలో కొనసాగుతుంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సర్దుబాటు జాబితాను ఆయా మండలాల ఎంఈవోలు సిద్ధం చేయాల్సి ఉంటుంది.ఈ మేరకు ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటుకు సుమారు 40మంది ఉపాధ్యాయులతో జాబితా సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. అయితే ప్రభుత్వం ఇటీవల చేసిన పదోన్నతుల ప్రకటన కార్యరూపం దాలిస్తే సర్దుబాటు జాబితా పెరిగే అవకాశాలుంటాయని తెలుస్తుంది. హైస్కూళ్ల ఉపాధ్యాయుల సర్దుబాటు పూర్తికాగానే మిగతా పాఠశాలలకు చెందిన సుమారు 150మందికి పైగా ఉపాధ్యాయులు సర్దుబాటు ప్రక్రియను ఎంఈవోల జాబితాల ఆధారంగా చేపట్టనున్నారు. అయితే ప్రతీ నెల ఉండే ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణలతో అయ్యే ఖాళీల భర్తీకి, సిలబస్ పూర్తికి ఏడాది పొడవునా తాత్కాలిక సర్దుబాటు ప్రక్రియ కొనసాగుతుందని అధికారుల అంటున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో గత విద్యా సంవత్సరంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగినట్టు అధికారులు పేర్కొంటున్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి ఇప్పటివరకు మొదటి తరగతిలో 2,822 మంది, రెండు నుంచి పదో తరగతి వరకు 2,976 మంది మొత్తంగా 5,798 మంది విద్యార్థులు చేరారు. అయితే ప్రభుత్వ యాజమాన్య ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ మేరకు జిల్లాలో 754 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య గురుకుల తదితర పాఠశాలల్లో 48,217 మంది, 159 ప్రైవేట్ పాఠశాలల్లో, 51, 517 మంది మొత్తంగా 913 పాఠశాలల్లో 99,734 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

పారదర్శకంగా సర్దుబాటు



విద్యార్థులకు సమగ్ర పాఠ్యాంశాల బోధన లక్ష్యంగా ఉపాధ్యాయుల తాత్కాలిక సర్దుబాటు పారదర్శకంగా నిర్వహిస్తాం. సిఫార్సులను పరిగణలోకి తీసుకోం. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఎలాంటి అపోహలకు గురికావద్దు. ఇందుకోసం పాఠశాలల వారీగా వివరాలు సేకరిస్తున్నాము.

-కె.సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి

పారదర్శకంగా నిర్వహించాలంటున్న ఉపాధ్యాయులు

సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని ఉపాధ్యాయులు అంటున్నారు. అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా వాస్తవ పరిస్థితులు ఆధారంగానే సర్దుబాటును చేపడితేనే విద్యార్థులకు అన్ని పాఠ్యాంశాల బోధన అందుబాటులోకి వస్తుందని, లేదంటే విద్యాశాఖ అపవాదులకు గురికావాల్సి వస్తోందని అంటున్నారు. అయితే కొంత మంది ఉపాధ్యాయులు తమకు అనువుగా ఉండే పాఠశాలకు సర్దుబాటులో వెళ్లేందుకు తమకున్న పరిచయాల ఆధారంగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులతో జిల్లా అధికారులకు సిఫార్సు లేఖలు ఇప్పిస్తూ, ఫోన్లు చే యిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈక్రమం లో కొంతమంది ఉపాధ్యాయులు తప్పుడు సమాచారాన్ని జొప్పిస్తున్నట్లు ప్రచారమవుతోంది.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు



మోటకొండూరులో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

మోటకొండూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. మండలకేంద్రంలో చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణ పనులు ఎలా సాగుతున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు అవసరమైన ఇసుక, మట్టి కొరత లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేసి హాజరు పట్టికను పరిశీలించారు. ఉపాధ్యాయురాలు అత్యవసర పరిస్థితుల్లో ఇంటికి వెళితే తప్పనిసరిగా సీఎల్ పెట్టాలి తప్ప మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో రాయకుడదని సూచించారు. బా లికల పాఠశాలలో పురుషులు ఉండడం ఏమిటని ప్రశ్నించారు. కంప్యూటర్ ఆపరేటర్‌ను వెంటనే ఇక్కడి నుంచి వేరే చోటికి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు సెల్‌ఫోన్లు ఇవ్వొద్దని తెలిపారు. వి ద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని ఏఎన్‌ఎంకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలోని సౌకర్యాలపై ఆరా తీశారు. ఆయనవెంట తహసీల్దార్ నాగదివ్య, ఎంపీవో చంద్రశేర్, ప్రిన్సిపాల్ జ్యోతి, ఆర్ఐ ఆసిఫ్, బుగ్గ కొమురయ్య, భూమండ్ల శ్రీనివాస్, మధు, గౌతమ్, శ్రీశైలం, ఉమేష్ ఉన్నారు.

యాదగిరిగుట్ట రూరల్: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి కావల్సిన సామగ్రి తక్కువ ధరకే ఇవ్వాలని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం గుట్ట మునిసిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇసుక, సిమెంట్, కంకర, ఇనుము ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌వ్యాప్తంగా భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఆయనవెంట తహసీల్దార్ గణేష్‌నాయక్, మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వామి తదితరులు ఉన్నారు.

రేషన్‌కార్డుల కల నెరవేరింది

ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

యాదగిరిగుట్ట రూరల్, జూలై 18, (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో రాని రేషన్ కార్డులు, కాంగ్రెస్ ప్రభుత్వంలో అందజేసి పేదల కల నెరవేరుస్తున్నామని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో ఆలేరు నియోజకవర్గవ్యాప్తంగా మంజూరైన రేషన్‌కార్డులను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలన్నింటికీ మూలమైన రేషన్‌కార్డులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రం వస్తే బతుకులు బాగుపడతాయని నమ్మించి మోసం చేసిన గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్కరేషన్‌కార్డు ఇవ్వలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 5.60లక్షల నూతన రేషన్‌కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇసుక, సిమెంట్, ఇనుము, ఇతర సామగ్రి తక్కువ ధరలకు అందిస్తున్నామని, ఇప్పటికీ నియోజకవర్గంలో సుమారు 2500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయని చెప్పారు. కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు పండుగ వాతావరణంలో అమలవుతున్నాయన్నారు. మహిళలకు మొదటి ప్రాధాన్యం ఇచ్చి ఆర్థిక బలోపేతానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు.

అదనపు కలెక్టర్(రెవెన్యూ) వీరారెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులో భాగంగా అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో మదర్‌డైరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ అయినాల చైతన్య రెడ్డి, మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంగ సత్యనారాయణ, మునిసిపల్ మాజీ చైర్మన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, నీలం పద్మ, స్థానిక తహసీల్దార్ గణేష్‌నాయక్, ఎంపీడీవో నవీన్‌కుమార్, మునిసిపల్ కమిషనర్ మిర్యాల లింగస్వామి, గుడ్లపల్లి భరత్‌గౌడ్, కళ్లెం శ్రీనివాస్‌గౌడ్, బందారుప భిక్షపతిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలకు చదువు ముఖ్యం

జిల్లా బాలల సంరక్షణ అధికారులు నిఖిత, భార్గవి



సమావేశంలో మాట్లాడుతున్న నిఖిత

భూదాన్‌పోచంపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలకు చదువు ఎంతో ముఖ్యమని, ప్రతీబాలిక విద్యావంతురాలు కావాలని జిల్లా బాలల సంరక్షణ అధికారులు నిఖిత, భార్గవి అన్నారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో 'బేటీ బచావో-బేటీ పడావో' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిత, భార్గవి మాట్లాడుతూ ప్రతీబాలిక ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థానంలో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డి.సాయివర్ధన్,వి.జ్యోతి, కళాశాల ఇన్‌చార్జి తులసి, అధ్యాపకులు ఎం.చందన, జి.రాజేశ్వరమ్మ, శ్రీదేవి, స్వాతి, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి

బీబీనగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీబీనగర్ మండలంలోని పడమటి సోమారం, వెంకిర్యాల, రుద్రవెల్లి, రాఘవాపురం, చిన్నరావులపల్లి, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాల్లో హెచ్‌ఎండీఏ, సీజీఎఫ్ , ఎస్‌సీసీఆర్‌ఆర్ నిధులు రూ16కోట్లతో నిర్మించతలపెట్టిన సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేసి మాట్లాడారు.

ఇల్లు లేని ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి సొంతింటి కల నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమని, ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చి, చెప్పిన ప్రతీ మాటకు కట్టుబడి ఉంటుందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధుల వరద పారిస్తామని, అభివృద్ధిలో భువనగిరి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్లు చింతల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పంజాల రామాంజనేయులు గౌడ్, గోళి పింగల్‌రెడ్డి, శ్యాంగౌడ్, సురకంటి సత్తిరెడ్డి, గోళి నరేందర్ రెడ్డి, ఆగమయ్య గౌడ్, నందిగారి బాస్వయ్య, పెంటయ్య గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ అనుసరణీయం

- పశ్చిమ బెంగాల్ బృందం కితాబు



ధాన్యం మిల్లింగ్, సేకరణ విధానం తెలుసుకున్న ప్రతినిధుల బృందం

భువనగిరి (కలెక్టరేట్), జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజాపంపిణీ వ్యవస్థ ఉత్తమ ప్రమాణాలతో కూడిన అనుసరణీయంగా ఉందని పశ్చిమబెంగాల్ రాష్ట్ర ఆహార పౌర సరఫరాలశాఖ ఉన్నతాధికారుల బృందం అభిప్రాయం వ్యక్తంచేసింది. తెలంగాణలో అమలవుతున్న ప్రజాపంపిణీ వ్యవస్థ అమలు తీరు అధ్యయనానికి శుక్రవారం భువనగిరిలో పర్యటించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేస్తున్న పీడీఎస్ పంపిణీ అమలు పద్ధతులను మూడు రోజులపాటు అధ్యయనం చేసి వారు తమ ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వహణకు ధాన్యం సేకరణ విధానం, రవాణా వాహన లోకేషన్ ట్రాకింగ్ అమలు, కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈమేరకు భువనగిరి మండలంలోని రాయిగిరిలోని వినోద్ ట్రేడర్స్ మిల్‌ను పరిశీలించి, ధాన్యం సేకరణ విధానం, మిల్లింగ్ జరుగుతున్న తీరును, రికార్డుల నిర్వహణతోపాటు ఆన్‌లైన్‌లో ధాన్యం నమోదు విధానం వంటి అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. తెలంగాణ ప్రభుత్వం పౌర సరఫరాల శాఖలో అనుసరిస్తున్న కీలక వ్యవస్థలపై అవగాహనకోసం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తరపున వచ్చినట్లు బృందానికి నాయకత్వం వహిస్తున్న ప్రణబ్ బిశ్వాస్ తెలిపారు. బృందంలో సుప్రతిమ్ లోధ్, సునయ్ కుమార్ గోస్వామి, దేబమాల్య బసుతోపాటు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మెగావత్ రోజారాణి, డీఎం హరికృష్ణ, రైస్ మిల్లుల యజమానులు, పౌర సరఫరాల శాఖ సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



ఆలేరులో మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

ఆలేరు, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ కోఆపరేటీవ్ సొసైటీ 250 నెలలు పూర్తి చేసుకుని శుక్రవారం ఆలేరులో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వివరించానని, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు ఎం.జోసెఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పీఆర్‌టీయూ క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్ కోమటిరెడ్డి నర్సింహారెడ్డి, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వీరారెడ్డి, అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గడసంతుల మధుసూదన్, నాయకులు పోరెడ్డి రంగయ్య, దశమంతరెడ్డి, మద్దూరి కాంతారావు, రాములు, అలీ, రామ్మోహన్ రావు, ధర్మారం వెంకటయ్య పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాజాపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ శిల్పిని కోరారు. శుక్రవారం రాజాపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, చల్లూరు పల్లె దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెడికల్ స్టాక్ వివరాలు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆమెవెంట మండల వైద్యాధికారి ప్రవీణ్ ఉన్నారు.



భువనగిరిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రవహిస్తున్న వరద నీరు

గుట్టలో 10.6 సెం.మీ.వర్షపాతం

యాదగిరిగుట్ట రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్టలో శుక్రవారం సాయంత్రం 5గంటల నుంచి 6గంటల వరకు కుండపోతగా వర్షం కురిసింది. స్థానిక సింహద్వారం నుంచి యోగానంద నిలయం, బస్టాండ్‌లో వరద ప్రవహించి జలమయం కాగా రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడి ప్రయాణికులు, ద్విచక్ర వాహన దారులు ఎక్కడికక్కడే నిలిచిపోయారు. యాదగిరిగుట్టలో అత్యధికంగా 10.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

భువనగిరి టౌన్: జిల్లా కేంద్రం భువనగిరిలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా కురిసి న వర్షంతో రహదారులు, ప్రాంతాలన్నీ వర ద నీటిమయమయ్యాయి. మురుగు కాల్వలు పొంగి పొర్లాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరా యం ఏర్పడింది. వరుసగా రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నప్పటికీ వేసవిని తలపిస్తున్న తరుణంలో కురిసిన వర్షాలతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమ నం పొందారు. కాగా వరద నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు మునిసిపల్ సిబ్బంది వర్షంలోనే మాన్‌హోల్స్ మూతలను తీస్తూ మురుగుకాల్వల్లో నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించారు. కాగా వర్షంతో హౌసింగ్‌బోర్డ్ కాలనీలో కూలిన ఇంటిని 10వ వార్డు మాజీ కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్ కుమార్ తదితరులు సందర్శించి బాధిత మహమ్మద్ నజీమా కుటుంబాన్ని పరామర్శించి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

వలిగొండ: మండలంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. కురిసిన వర్షానికి కొద్దిసేపు విద్యుత్ అంతరాయం కలిగింది. ఈ వర్షంతో పంటలకు లబ్ధి చేకూరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

యాదగిరిగుట్టలో కురుస్తున్న వాన





భువనగిరిలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న నేతలు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం లక్ష్మీశ్రావ్య



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మిశ్రావ్య..

మోటకొండూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అవగాహన అవసరం అని రిజర్వ్ బ్యాంక్ ఏజీఎం లక్ష్మిశ్రావ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖాతాదారులు సైబర్‌నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, అపరిచితుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెస్సేజ్‌లకు స్పందించవద్దని, ఓటీపీలు, వ్యక్తిగత వివరాలను చెప్పవద్దన్నారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంక్ మేనేజర్ శివరామకృష్ణ, కెనరా బ్యాంక్ మేనేజర్ చిన్న, వంశీ, పురుగుల మల్లేష్, నేముల ప్రవీణ్, అరుణ, లావణ్య, సునీత పాల్గొన్నారు.

విశ్రాంత సైనికుడు రాజేష్ మృతి

• 2016 సర్జికల్ స్ట్రైక్‌లో కీలకపాత్ర • నేడు భువనగిరిలో అంత్యక్రియలు


రాజేష్(ఫైల్‌ఫొటో)

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన విశ్రాంత సైనికుడు తునికి రాజేష్(44) శుక్రవారం మృతి చెందారు. రెండు నెలల కిందటే ఉద్యోగ విరమణ చేశారు. ఢిల్లీలోని ఆర్మీ ఆస్పత్రిలో ఇటీవలే కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స జరగగా చికిత్సపొందుతూ ఆస్పత్రిలో మృతి చెందారు. 2016 సెప్టెంబర్‌లో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్‌లో పారా రెజిమెంట్ సైనికుడిగా కీలకపాత్ర పోషించారని సన్నిహితులు తెలిపారు. రాజేష్ తండ్రి తునికి నరసింహ సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఆయన మృతి చెందారు. సోదరుడు కిషోర్ కూడా విశ్రాంత సైనికుడే. రాజేష్‌కు ఇద్దరు పిల్లలు, భార్య ఉన్నారు. భువనగిరి ధోబీవాడలోని స్వగృహం నుంచి శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా రాజేష్ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

చేపలవేటకు వెళ్లి చెరువులో గల్లంతు


కోమటికుంట చెర్వులో గల్లంతైన వ్యక్తి కోసం గాలిస్తున్న రెస్క్యూటీం

పాలకవీడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలో చేపలవేటకు వెళ్లిన చెరువులో గల్లంతయ్యాడు. ఎస్‌ఐ కోటేష్, స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పాలకవీడు మండలం కోమటికుంట గ్రామానికి చెందిన రాతికింద లింగయ్య(57) భార్యతో కలిసి గురువారం రాత్రి అదే గ్రామశివారులోని చెర్వులో చేపల వేటకు వెళ్లాడు. అదే సమయంలో ఈదురుగాలులతో కూడిన వర్షం రావడంతో నీటిలో పడిపోయాడు. గమనించిన భార్య గ్రామస్థులకు సమాచారం తెలిపింది. వెంటనే స్పందించిన గ్రామస్థులు సంఘటనా స్థలానికి చేరుకుని చెర్వులో వెతికారు. రాత్రి సమయం కావడంతో వెతుకులాట ఇబ్బందిగా మారింది. దీంతో తెల్లవారుజామున పడవల సహాయంతో వలలు వేసి వెతికినా లింగయ్య ఆచూకీ లభించలేదు. దీంతో సమాచారాన్ని రెస్క్యూ టీంకు అందించారు. శుక్రవారం ఉదయం నుంచి 12 గంటలుగా రెస్క్యూం టీం వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు, గ్రామస్థులు పడిగాపులు కాస్తున్నారు. గల్లంతైన లింగయ్య ఆచూకీ లభ్యమయ్యే వరకు రెస్క్యూ టీం పనిచేస్తుందని ఎస్‌ఐ కోటేష్ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి దారుణహత్య

బచ్చన్నపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా బచ్చన్నపేట మండల కేంద్రంలోని చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి దారుణహత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం శారాజీపేటకు చెందిన బత్తుల రాజిరెడ్డి(50) బతుకు దెరువు కోసం 25ఏళ్ల క్రితం బచ్చన్నపేటకు వచ్చి పలు హోటళ్లలో పనిచేస్తుండేవాడు. కొన్నేళ్లుగా మతిస్థిమితం సరిగాలేక రోడ్ల వెంట తిరుగుతూ, రాత్రివేళ తనకు తోచిన ప్రదేశంలో నిద్రిస్తుండేవాడు. శుక్రవారం ఉదయం చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న బిల్డింగ్‌లో తలపై బలమైన గాయాలై రక్తపు మడుగులో మృతిచెంది ఉన్నాడు. కర్రలు, రాళ్లతో తలపై బాది చంపినట్టు స్థానికులు చర్చించుకుంటున్నారు. రాజిరెడ్డి అవివాహితుడు కాగా, అతడి సోదరుడు జోగిరెడ్డి, చెల్లెలు వరలక్ష్మి ఆలింపూర్‌లో ఉంటున్నారు. మతిస్థిమితంలేని వ్యక్తిని చంపాల్సిన అవసరం ఏమొచ్చిందనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ అబ్బయ్య, ఎస్‌ఐ ఎస్‌కే హమీద్ సంఘటనా స్థలానికి చేరుకుని, జాగిలాలను రప్పించి పరిశీలించారు. సీసీ కెమెరాల ఆధారంగా విచారణ జరుపుతున్నారు. రాజిరెడ్డి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులపై దివ్యాంగురాలి ఫిర్యాదు

మఠంపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల వద్ద దాచిన సొత్తు, భూమి పత్రాలను తిరిగి ఇవ్వడంలేదని సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండల పోలీస్‌స్టేషన్‌లో ఓ కుమార్తె శుక్రవారం ఫిర్యాదుచేసింది. ఎస్‌ఐ బాబు, ఫిర్యాదురాలు బక్కమంతులగూడెం గ్రామానికి కాసాని రేణుక తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేణుకకు 20 ఏళ్ల కిందట పెళ్లి కాగా, ఆ తర్వాతతో పలుకారణాలతో భర్తతో విడాకులు తీసుకుని ఒంటరిగా జీవిస్తోంది. ఆ సమయంలో భర్త నుంచి వచ్చిన నగదు, నగలు, భూమి పత్రాలను తల్లిదండ్రులు వద్ద దాచింది. అవసరాల నిమిత్తం తిరిగివ్వాలని కోరినా ఇవ్వకుండా తల్లిదండ్రులు సైదులు, పద్మ మానసికంగా, ఆర్థికంగా వేధిస్తున్నారని రేణుక ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మఠంపల్లి పోలీసులకు ఫిర్యాదుచేసింది. తనకేం జరిగినా పూర్తి బాధ్యత వాళ్లదే అని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాబు తెలిపారు.


పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లేఖను చూపిస్తున్న రేణుక

బేతవోలుకు మలక్‌పేట పోలీసులు?

చిలుకూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మలక్‌పేటలో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చందునాయక్ హత్య కేసును విచారిస్తున్న పోలీసులు గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలానికి వచ్చినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. హత్యోదంతంలో నిందితులుగా ఉన్న వారు చిలుకూరు మండలం బేతవోలు గ్రామంలోని బంధువుల ఇంటికి వచ్చినట్లుగా తెలిసింది. వారిని గాలిస్తున్న మలక్‌పేట పోలీసులు స్థానిక పోలీసుల సహాయంతో పట్టుకునేందుకు బేతవోలుకు రాగా అప్పటికే వారు గ్రామం నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. వారి బంధువులను విచారించగా సాధారణంగా బంధువులు కావటంతో తమ ఇంటికి వచ్చారని, ఉదయాన్నే వెళ్లిపోయారని చెప్పడంతో మలక్‌పేట పోలీసులు వెనుతిరిగిరినట్లు తెలుస్తోంది.

అనుమతి లేకుండా కలపరవాణా చేస్తే కఠినచర్యలు

హుజూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా మామిడి చెట్లతో పాటు ఇతర కలపను రవాణా చేయాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అటవీ క్షేత్ర అధికారి ఎస్ ఆనందరెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. అటవీ శాఖ నుంచి ఎన్‌వోసీ పొందిన తరవాతనే కలప రవాణా చేయాలని పేర్కొన్నారు. కొందరు దళారులు రైతుల తోటలలో చెట్లను అటవీ శాఖ నుంచి అనుమతులు తీసుకున్నామని చెప్పి ఎలాంటి అనుమతి లేకుండా రవాణా చేస్తున్నారన్నారు. కొన్నిచెట్లకు మాత్రమే రుసుం చెల్లించి ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా కలపను అక్రమంగా తరలిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు తాము తొలగించుకోదలచిన చెట్లకు టీజీఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఫీజు చెల్లించి తొలగించుకోవాలని కోరారు. ఎన్‌టీపీఎస్ నుంచి ఎన్‌వోసీ తీసుకొని కలప రవాణా చేసుకోవాలన్నారు. అనుమతి లేకుండా కలపను తరలించే రైతులపై తెలంగాణ రాష్ట్ర అటవీ చట్టం 1967, వాల్టా యాక్టు 2002 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమంపై ఎవరికైనా సందేహాలు ఉన్నా, సలహాల కోసం అటవీశాఖ సిబ్బందిని సంప్రదించాలని ప్రకటనలో కోరారు.

రోడ్డు పనులు అడ్డుకున్నరైతులు

హుజూర్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో రోడ్డు పనులను రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. వేపలసింగారం నుంచి కందిబండ వరకు రూ.2.3 కోట్లతో మూడు కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మిస్తున్నారు. కాగా కాంట్రాక్టర్ రోడ్డు పనుల కోసం పొలాల్లో గుంతలు తీసి మట్టిని తరలిస్తున్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. మట్టిని తీస్తున్న ఎక్స్‌కవేటర్లను అడ్డుకున్నారు. దీంతో రైతులకు, పనులు చేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల మధ్య వాగ్వాదం జరిగింది. రోడ్డుకు ఇరువైపులా రైతుల పట్టా పొలంలో సుమారు 10 అడుగుల లోతు గుంతలు తీసి మట్టిని తరలిస్తున్నారని రైతులు ఆరోపించారు. పొలాల్లో గుంతలు పూడ్చాలంటే ఎకరానికి రూ.20వేలు ఖర్చవుతుందని ఆందోళన చేశారు. కార్యక్రమంలో రైతులు ఆదూరి నగేష్, రామకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, నాగిరెడ్డి, శ్రీనినవాసరెడ్డి, యలమంద, నాగరాజు, శ్రీనివాసు, శంభిరెడ్డి, సోమిరెడ్డి, సావిత్రమ్మ, లక్ష్మమ్మ, బండారు గోపి, చింతిర్యాల శ్రీనివాసు పాల్గొన్నారు.


ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకుంటున్న రైతులు

'అభ్యుదయ' సేవ


తాటిపాముల గ్రామంలో చెక్ అందజేస్తున్న యూత్ సభ్యులు

సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలోని అభ్యుదయ యువజన సమైక్య యూత్ సామాజిక సేవలో ముందుకు సాగుతూ పలువురి ప్రశంసలు అందుకుంటోంది. 1999లో 25 మందితో మొదలైన సమైక్య ప్రస్తుతం 150 మందికి చేరింది. గ్రామంలోని ఏ పేదవారికి కష్టం వచ్చినా మేమున్నామంటూ సభ్యులు అండగా నిలుస్తున్నారు. అంతేకాకుండా గ్రామ అభివృద్ధికి దిక్సూచిగా నిలుస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-తిరుమలగిరి రూరల్)

యువజన సమైక్య యూత్ సామాజిక, పర్యావరణ అంశాలపై కృషి చేస్తోంది. మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం, తల్లిదండ్రులు లేని పిల్లలకు చదువుకు తోడ్పాటు అందించడం, ప్రైవేటు పాఠశాలకు వెళ్లే విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు వెళ్లేలా అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వచ్చినా యూత్ సభ్యులు తలా కొంతడబ్బు వేసుకొని ఆ కుటుంబానికి అండగా ఉంటున్నారు. యూత్ వ్యసనాలకు ఆకర్షితులకు కాకుండా గ్రామంలోని యువకులు సామాజిక అంశాలపై మక్కువ చూపుతుండటం ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తోంది. ఒకప్పుడు చదువు- వెలుగు కార్యక్రమం ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ గ్రామం నుంచి ప్రారంభమైంది. ఇక్కడి నుంచే రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్లు, కళారూపాల సారథులుగా ఎదిగారు. 400 మంది కళాకారులు ఉన్న ఈ గ్రామంలో ఏ పేదకు ఇబ్బందివచ్చినా ఆదుకోవడం ఆదర్శంగా నిలుస్తోంది.

ప్రతీ ఒక్కరికీ అవకాశం

సమైక్య యూత్‌లో బాధ్యతలను అందరికీ వచ్చేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రతీ ఏడాది సంక్రాంతి మరుసటి రోజు గ్రామంలో సమావేశమవుతారు. గత ఏడాది అధ్యక్ష, ఉపాధ్య, కార్యదర్శి, కోశాధికారితో పాటు కమిటీ సభ్యులందరూ కమిటీ నుంచి వైదొలుగుతారు. ఇతరులకు అవకాశం కల్పిస్తారు. దీంతో సంఘంలోని ప్రతీ సభ్యుడికి ఏదో సందర్భంలో బాధ్యత అనేది రావడం వల్ల సమైక్య పట్ల గౌరవం పెరుగుతుంది.


విజేతలకు బహుమతుల అందిస్తున్న సభ్యులు

అండగా నిలిచారు



నా భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. యువజన సమైక్య యూత్ సభ్యులంతా అండగా నిలిచారు. నా కుమార్తె పేరు మీద రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి నా కుటుంబానికి అండగా నిలిచారు. వారికి నా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది. ఇలా యువకులంతా కలిసి గ్రామంలోని పేదలను ఆదుకోవడం అభినందనీయం.

-కారుపోతుల లాస్య, గ్రామస్థురాలు.

ఒక్కతాటిపై ఉంటాం



సమైక్య 1999లో 25మందితో ఏర్పాటైంది. నాటి నుండి నేటి వరకు పార్టీలకు అతీతంగా ఉంటూ, గ్రామ యువకులంతా ఒక్కతాటిపై ఉంటాం. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ ఆదర్శంగా ఉంటున్నా

- రేగుల మహేందర్, అభ్యుదయ యువజన సమైక్య యూత్ అధ్యక్షుడు.

ఎన్నోకుటుంబాలకు ఆసరాగా నిలిచాం



గ్రామంలోని పేద వారు ఎవరు మృతి చెందినా, అంగవైకల్యం చెందినా యూత్ సభ్యులం వెంటనే స్పందించి ఆర్థికసహకారం చేస్తూ ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలిచాం. ఆ కుటుంబంలో జరిగిన నష్టాన్ని బట్టి ఆ కుటుంబానికి ఆర్థిక సహకారాన్ని అందిస్తాం. ఇలా సేవ చేయడంలో ఎంతో ఆనందాన్ని పొందుతున్నాం. ఈ మధ్య కాలంలో భూమి, జాగ లేని కుటుంబయాజమాని మృతి చెందడంతో అతడి కుమార్తె పేరు మీద పోస్టాఫీసులో రూ.2 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆసరాగా నిలిచాం

- దయాయాదవ్, మాజీ అధ్యక్షుడు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు


చౌటుప్పల్ సమీపంలోని పంతంగి టోల్‌గేట్ వద్ద నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

చౌటుప్పల్ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినచర్యలు తీసుకుంటామని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి హెచ్చరించారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ వద్ద శుక్రవారం చౌటుప్పల్ పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గంజాయి, డ్రగ్స్, మారణాయుధాల సరఫరాపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి / రామన్నపేట : రాచకొండ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలం దేశ్‌ముఖి గ్రామం నుంచి కవాడిపల్లి గ్రామం వరకు పోలీసులు నాకాబందీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ రాములు, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, పోలీసు సిబ్బబంది పాల్గొన్నారు. ప్రతీ వాహనదారుడు సరైన ధ్రువపత్రాలు కలిగి ఉండాలని రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు కోరారు. రామన్నపేట పట్టణ శివారులోని ఓ ఫంక్షన్‌హాల్ వద్ద శుక్రవారం నాకబందీ చేపట్టారు. సరియైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 10 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ డీ నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

నకిరేకల్‌లో గంజాయి ముఠా అరెస్టు

• 10 మంది రిమాండ్

• పరారీలో ముగ్గురు


నకిరేకల్‌లో గంజాయి ముఠా వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి


నకిరేకల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తూ, తాగుతున్న పది మంది ముఠాను నల్లగొండ జిల్లా నకిరేకల్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం నకిరేకల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి వెల్లడించారు. నకిరేకల్ శివారులోని సాయిప్రియ హోటల్ వెనుక గడ్డివాము పక్కన ఓ ఇంట్లో గంజాయి విక్రయిస్తున్నార్న సమాచారం మేరకు గురువారం తనిఖీలు చేసి 10మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, నకిరేకల్‌కు చెందిన కిషోర్‌టండన్ స్థానికంగా ఉన్న డెయిరీఫాంలో కారు డ్రైవర్‌గా పనిచేస్తూ గంజాయి పీల్చేందుకు అలవాటు పడ్డాడు. డబ్బులు అధికంగా సంపాదించాలనే ఆశతో ఒడిశా రాష్ట్రానికి చెందిన గోల్నాక వద్ద తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి నకిరేకల్ రైస్‌మిల్లులో పనిచేస్తున్న వారికి విక్రయించాడు. మిల్లులో పని చేసే వారితో పాటు నకిరేకల్‌కు చెందిన వారికి విక్రయించాడు. మిల్లులో పనిచేస్తున్న అర్జున్‌కుమార్, అనిల్ మన్నన్, అబ్బు, వికాస్‌లు ఒకొక్కరికి 500 గ్రాముల చొప్పున, నకిరేకల్‌కు చెందిన క్రాంతి, సంతు, అఖిల్ రెడ్డి, సియాం, శ్రీకాంత్, నాగేందర్ మరికొంత మందికి 50 గ్రాముల ప్యాకెట్లను అమ్మినట్లు విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 13 మందిలో 10మందిని అరెస్టు చేశామని మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. వారినుంచి 3.300 కిలోల గంజాయిని పట్టుకున్నామని, వాటి విలువ రూ.83 వేలు ఉంటుందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్‌రెడ్డి, రూరల్ సీఐ కొండల్‌రెడ్డి, ఎస్‌ఐ లచ్చిరెడ్డి, పోలీసు సిబ్బంది వై.వెంకటేశ్వర్లు, సుధాకర్, ఎం.సురేష్, శ్రీకాంత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న ముగ్గురి రిమాండ్

తిరుమలగిరి(సాగర్), జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గంజాయితో పట్టుబడిన ముగ్గురిని నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) పోలీసులు అదుపులోకి తీసుకోని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం మండలకేంద్రం శివారులో కొందరు గంజాయి సేవిస్తున్నారని సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లామన్నారు. చందూరు మండలం కోటయ్యగూడెం గ్రామానికి చెందిన శివరాత్రి దుర్గాప్రసాద్, తిరుమలగిరి గ్రామానికి చెందిన వరికుప్పల దిలీప్‌కుమార్, వరికుప్పల ప్రశాంత్‌లతో పాటు చిలకాపురం గ్రామానికి చెందిన తుడుం ధనుంజయలు గంజాయి సేవిస్తున్నారని తెలిపారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయగా ధనుంజయ్ పారిపోయాడని, మిగతా ముగ్గురు నుంచి 96 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు, ఒక బాంగ్ బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుల విచారణ సందర్భంగా మండలంలో 10 మంది వరకు గంజాయి సేవించే వారున్నట్లు గుర్తించామన్నారు. వారిని కౌన్సెలింగ్ కేంద్రానికి పంపిస్తామని ఆయ తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, రవాణా చేసినా వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. నిందితులను నిడమనూరు కోర్టులో రిమాండ్‌కు పంపించామన్నారు.

భువనగిరిలో రెండిళ్లలో చోరీ

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట జిల్లాకేంద్రం భువనగిరి పట్టణ హౌసింగ్ బోర్డులో శుక్రవారం తెల్లవారుజామున రెండిళ్లలో దొంగలు చోరీలకు పాల్పడ్డారు. మూడో ఇంటిలో చోరీకి యత్నించారు. దొంగల కదలికలు సీసీ కెమెరా ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. భువనగిరి రూరల్ హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న ఇంటిలో అద్దెకు ఉంటున్న మోటకొండూరు ఎంపీడీవో ఇందిర ఇంటికి తాళం వేసి ముందురోజు ఊరికి వెళ్లింది. ఇదే దొంగలు ఇంటి తాళం పగులగొట్టి రూ.5లక్షల విలువైన 5 తులాల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. అదే బస్తీలోని వెంకట్ రెడ్డి ఇంటిలోకి కూడా ఇదేతరహాలో ప్రవేశించి రూ.40వేల నగదును అపహరించారు. మరో ఇంటిలో చోరీకి ప్రయత్నించినా ఫలించలేదు. చోరీలు జరిగినట్లు గమనించిన బాధితులు పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో పోలీసు అధికారులు సంఘటనా స్థలాలను సందర్శించి ఆధారాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


దొంగలు ఎంపీడీవో ఇంట్లో చిందరవందరగా వేసిన వస్తువులు

• జనగాం జిల్లాలో చిట్యాల వాసి చోరీలు


జనగాం జిల్లా నెక్కొండ పోలీసుస్టేషన్‌లో నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి

నెక్కొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి):తాళం వేసిన ఇళ్లు లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న దొంగను శుక్రవారం అరెస్టు చేసినట్లు జనగాం జిల్లా నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం నేరెడ గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బిర్రు రమేశ్‌బాబు జల్సాలకు అలవాటుపడి ఇటీవల నెక్కొండ, జనగామ పట్టణాల్లోని ఇళ్లలో చోరీలకు పాల్పడుతుండగా అతడిని పోలీసులు పట్టుకున్నారన్నారు. నెక్కొండకు చెందిన బండారు కొమురయ్య ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితుడు 12 తులాల బంగారు నగలు, 33 తులాల వెండి వస్తువులను చోరీ చేసినట్లు తెలిపారు. అలాగే జనగామ ప్రాంతంలోని పలు ఇళ్లలో దొంగతనాలకు పాల్పడి 6.6 తులాల బంగారు నగలు, 65 తులాల వెండి వస్తువులు దొంగిలించగా నిందితుడు నుంచి రికవరీ చేశామన్నారు. నిందితుడిని పట్టుకున్న నెక్కొండ ఎస్‌ఐ మహేందర్, హెచ్‌సీ అక్బర్‌పాషా, పీసీలు బీ రమేశ్, సాంబయ్య, స్వామి, సీసీఎస్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

కనగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలం ఇరుగంటిపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో రైతు మృతి చెందాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇరుగంటిపల్లి గ్రామానికి చెందిన బొప్పిడి సత్తిరెడ్డి (79) రెండు ఎకరాలు సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం నాటు వేయించేందుకు ఉదయం 8 గంటల సమయంలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. తండ్రి ఇంటికి రాకపోవడంతో కుమారుడు జానిరెడ్డి ఉదయం 11గంటలకు పొలం వద్దకు వెళ్లాడు. సత్తిరెడ్డి పొలంలో విగతజీవిగా పడిపోయి కనిపించాడు. కుడిచేతికి సర్వీస్ వైర్ తగిలి ఉండటాన్ని గమనించి విషయాన్ని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో సమాచారం అందించాడు. అనంతరం వారు అక్కడికి చేరుకుని విద్యుత్‌సరఫరాను నిలిపివేసి సత్తిరెడ్డిని నల్లగొండ ప్రభుత్వ ఆసపత్రికి తరలించారు. ఆస్పత్రిలో పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుమారుడు జానిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు. నల్లగొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. మృతుడు సత్తిరెడ్డికి భార్య లక్ష్మమ్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు.

ఇసుకను డంప్ చేసిన వ్యక్తిపై కేసు

అడ్డగూడూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా డంప్ చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు యాదాద్రిభువనగిరి జిల్లా అడ్డగూడూరు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు గ్రామానికి చెందిన కూటికంటి రమేష్ ఇంటి వద్దకు పోలీసులు వెళ్లి అక్కడ పరిశీలించారు. ఇసుకను డంప్ చేసి అక్రమంగా తరలించడానికి ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదే గ్రామానికి చెందిన బండి సాయికుమార్ చిర్రగూడూరు బిక్కేరు వాగు నుంచి ప్రభుత్వ అనుమతి, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా చుట్టుప్రక్కన గ్రామాలకు ఇసుకను అక్రమంగా రవాణా చేసున్నారని ఎస్‌ఐ తెలిపారు. డంప్ చేసిన 24 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని నిందితుడిని అదుపులోకి తీసుకుని, సుమోటగా కేసు నమోదు చేసినట్ల ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేట్‌లో ఫీజుల దోపిడీని అరికట్టాలి


సూర్యాపేటలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ ఆ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి

సూర్యాపేటఅర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు దనియాకుల శ్రీకాంత్‌వర్మ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని చంద్రపుల్లారెడ్డి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 23న వామపక్షవిద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన విద్యాసంస్థల రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువస్తామని నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సమావేశంలో నాయకులు పిడమర్తి భరత్, పులుసు శ్రవణ్, ధూదిపాళ ప్రవీణ్, మందడి శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఔదార్యం..చెర్వుకు 'జలమార్గం'

● గోపలాయపల్లి వద్ద కాల్వ తవ్వేందుకు రైతుల అంగీకారం
● ప్రాజెక్టు అధికారుల సూచనతో మొదలైన కాల్వ తవ్వకం



రైతుల భూముల్లోంచి తవ్వుతున్న పైప్‌లైన్

నార్కట్‌పల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఎండలు మండిపోతున్నాయి..రోహిణి కార్తెలో కూడా ఇంతటి ఎండ లేదు...నార్కట్‌పల్లి అసలే వర్షాధారిత వ్యవసాయం జరిగే ప్రాంతం...ఆపై భూ గర్భ జలాలు అడుగంటాయి. నెల ముందుగానే ప్రవేశించిన నైరుతి రుతుపవనాల జాడ లేదు. వేసిన పత్తిపంట...నాటేసిన వరి నారుమళ్లు నీటి కోసం నింగి వైపు చూస్తున్నాయి. వర్షం కురిసేటట్టు లేదు...చేను తడిచేటట్టు లేదు. ఇక ఆ రైతుల ముందు 'ఉదయించి'న ఏకైక మార్గమల్లా బీ.వెల్లెంల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించుకోవడమొక్కటే. రిజర్వాయర్ ప్రధాన ఎడమ కాలువ ద్వారా నీటిని నార్కట్‌పల్లి చెర్వుకు అక్కడి నుంచి ఎం.ఎడవల్లి, ఏపీలింగోటం చెర్వులకు చేర్చాలి. కానీ ప్రధాన కాలువ నుంచి మైనర్ కాల్వ తవ్వి చెర్వులోకి నీరు తీసుకురావాలంటే మహేశ్, నరేశ్, శ్రీకాంత్ అనే రైతులకు చెందిన భూముల నుంచే తవ్వాలి. దీంతో ఇక్కడి అధికార పార్టీ నాయకులు ఆ రైతులను సంప్రదించారు. ఆ రైతులు కూడా పెద్ద మనసు చేసుకుని ఔదార్యం చూపారు. దీంతో చెర్వులోకి నీరు వచ్చేలా మైనర్ కాల్వ తవ్వకం పనులు శుక్రవారం బీ.వెల్లెంల ప్రాజెక్టు ఈఈ గంగం శ్రీనివాస్‌రెడ్డి సూచన మేరకు సమక్షంలో మొదలయ్యాయి. రైతుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, సామ నరేందర్‌రెడ్డి, గాలి నర్సింహ్మ, తుపాకుల వెంకన్న, ప్రాజెక్టు డీఈఈలు విఠల్, మారం శ్రీనివాస్, ఏఈ నవీన్‌కుమార్ ఉన్నారు.

కల్లు దుకాణాల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

తెలంగాణ కల్లుగీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జానయ్యగౌడ్

కనగల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కల్లు దుకాణాల ఎత్తివేత నిర్ణయాన్ని అధికారులు విరమించుకోవాలని తెలంగాణ కల్లు గీత వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తొర్పునూరి జానయ్యగౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కల్తీ కల్లు తయారు చేసిన బాధ్యులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరో ఒక్కరు చేసిన తప్పుకు అందరికీ అంటగడుతూ అధికారులు కల్లు దుకాణాలన్నింటినీ ఎత్తివేసే చర్యలు చేపట్టడం సబబు కాదన్నారు. హైదరాబాద్ పరిధిలో సుమారు 500వరకు కల్లు దుకాణాలుండగా వాటి ద్వార వేలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. కల్లు దుకాణాలను రద్దు చేస్తే వారంతా ఉపాది కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉందన్నారు. ప్రమాద వశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి మృతి చెందిన గీత కార్మికుల కుటుంబాలకు పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియాను వెంటనే మంజూరు చేయాలన్నారు.

అందరికీ చేనేత భరోసా ఇవ్వాలి

నల్లగొండ రూరల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జియో ట్యాగ్ కలిగిన అందరికీ చేనేత భరోసా ఇవ్వాలని, ఎలాంటి షరతులు లేకుండా రుణ మాఫీ చేయాలని కోరుతూ ఈనెల 22, 23, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుటధర్నాలు నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి కొమరయ్య భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత భరోసా పథకం ద్వారా జియో టాక్ వేసిన ప్రతి మగ్గానికి ఎలాంటి షరతులు లేకుండా చేనేత కార్మికుడికి, అనుబంధ వృత్తుల కార్మికులకు చేనేత భరోసా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, అధికారులు వెంటనే ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. పవర్‌లూమ్ కార్మికులకు రుణమాఫీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చేనేత కేంద్రాలలో సబ్సిడీతో నూలు డిపోలు ఏర్పాటు చేసి చేనేత కార్మికులకు అందించాలని కోరారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేనేత, పవర్ లూమ్ కార్మికులందరూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు నిర్వహించి ప్రభుత్వానికి కలెక్టర్ల ద్వారా వినతిపత్రాలు పంపాలని పిలుపునిచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గంజి నాగరాజు, దండెంపల్లి సత్తయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కందగట్ల గణేష్ పాల్గొన్నారు.

ఎల్లమ్మను దర్శించుకున్న ఏసీ భాస్కర్



అమ్మవారి ఆలయంలో ఏసీ భాస్కర్

కనగల్, జూలై 18: (ఆంధ్రజ్యోతి) మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని శుక్రవారం జిల్లా ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కె.భాస్కర్ సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. ఏసీకి అర్చకులు వేద ఆశీర్వచనాలను, తీర్థప్రసాదాలను అందజేసారు. ఏసీ వెంట ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ సుమతి, ఆలయ సిబ్బంది తదితరులున్నారు.

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఆ కళాశాల ఒక వ రం లాటింది. ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థులు తమ అదృష్టంగా భావిస్తారు. విద్యా రంగంలోనే ఘన కీర్తిని చాటుతున్న నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల 70వ వసంతంలోకి అడుగిడుతోంది. 1956వ సంవత్సరంలో ప్రారంభమైన ఎన్జీ కళాశాల స్థాపక దినోత్సవాన్ని ఈ నెల 22వ తేదీన నిర్వహించేందుకు, ప్లాటినం వేడుకలను నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది.

– (ఆంధ్రజ్యోతి,నల్లగొండ)



విద్యా రంగంలో..

ఎన్జీ కళాశాల ఘన కీర్తి

ఎన్జీ కళాశాలలో డిగ్రీతో పాటు పీజీ కోర్సులు ఉన్నాయి. 27రకాల కోర్సులతో దినదిన ప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతోంది. ఆరు పీజీ కోర్సులతో కొనసాగుతోంది. బీఎస్సీ, బీఏ, బీకాంలతో పాటు బీసీఏ, బీబీఏ వంటి అదనపు కోర్సులు ఉండగా ఆయా విభాగాల్లో మొత్తం 1560 సీట్లు ఉన్నాయి. అదనంగా కోర్సుల్లో మరో 2500మంది వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఎన్జీ కళాశాలకు విశాలమైన క్రీడా మైదానంతో పాటు నూతన తరగతి గదులు, ఆధునాతనమైన ప్రయోగశాలలు, అతిపెద్ద గ్రంథాలయం వంటి సౌకర్యాల ఉన్నా యి. ఈ కళాశాలలో అనుభవజ్ఞులైన ఆధ్యాపకులతో బోధన చేయడంతో ఏటా విద్యార్థులు ఆయా కోర్సుల్లో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు. విద్యార్థులు ఉద్యోగాలు సాధించడంతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకుంటూ ఆయా రంగాల్లో రాణించడానికి వేదికగా మారింది. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాలను కూడా నిర్వహిస్తూ విద్యార్థులను సమాజ సేవలో భాగస్వామ్యులను చేయడంలో ఆధ్యాపకుల పాత్ర ఎంతగానో ఉంది. గ్రంథాలయాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయడంతో పాటు సుమారు 60వేలకు పైగా పుస్తకాలను అందుబాటులో ఉంచారు. అకాడమిక్‌తో పాటు పీజీ ఎంట్రన్స్, పోటీ పరీక్షలకు సంబంధించి పుస్తకాలు రీడింగ్ హాల్‌లో అందుబాటులో ఉన్నాయి.

1956వ సంవత్సరంలో ఎన్జీ కళాశాల స్థాపన

1956వ సంవత్సరంలో ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చేతుల మీదుగా బీఏ కోర్సులో 90 మంది విద్యార్థులతో ప్రారంభమై 69 వసంతాలు పూర్తి చేసుకుని 70 వసంతంలోకి అడుగిడి ప్లాటినం వేడుకలకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం అన్ని గ్రూపులు, కోర్సు లు కలిపి నాలుగు వేల మందికి పైగా విద్యార్థులు విద్యను అభ్యసించడం విశేషం. ఎన్జీ కళాశాలలో గత 69సంవత్సరాల్లో చదివిన పూర్వ విద్యార్థులు అనేక మంది 183 దేశాలల్లో వివిధ రంగాల్లో పనిచేస్తున్నారు. అఖిల భారత సర్వీసులతో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాలలో కూడా ఎంతో మంది రాణిస్తున్నారు. ప్ర స్తుతం ఉన్న పాత భవనం శిథిలావస్థకు చేరి కూలిపో యే దశలో ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.36కోట్లు విడుదల చేయడంతో నూతన భవనాన్ని నిర్మించారు. అందులో తరగతుల నిర్వహణ కొనసాగుతోంది.

» 183 దేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న పూర్వ విద్యార్థులు
» 27రకాల కోర్సులతో దినదిన ప్రవర్ధమానం
» తెలంగాణ టాప్ -3 స్థానంలో కళాశాల
» ఈ నెల 22న 70వ వసంతంలోకి అడుగిడుతున్న వేళ
» ప్లాటినం వేడుకలకు సర్వం సిద్ధం

ప్రతిభ చాటిన విద్యార్థులకు బంగారు పతకాలు

నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 23 సంవత్సరాలుగా అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నారు. కళాశాల పూర్వ ప్రధా న చార్యులు భాస్కర్‌రావు, విద్యార్థుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.లింగయ్య కలిసి ఈ సంవత్సరం సుమారు రూ.10.50లక్షలు కళాశాల కు అందజేయడంతో ఈ విద్యా సంవత్సరం కూడా బం గారు పతకాల కార్యక్రమాన్ని కళాశాల చేపట్టింది. ఈనెల 22న జరిగే ప్లాటినం వేడుకల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ ప్రదానం చేస్తున్నారు. ఇంకా ఎవరైనా ఔత్సాహికులు ఉంటే లక్ష 50వేలు కళాశాలలో డిపాజిట్ చేస్తే వారి పేరు మీద లేదా వారు సూచించిన వారి పేరు మీద ప్రతి ఏటా బంగారు పతకాలను అందజేస్తారు. ఈ మేరకు కళా శా ల తరఫున విరాళాలు అందజేయాలని కోరుతున్నారు.



1956 సంవత్సరం జూలై 22న ఆనాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభమైన ఎన్జీ కళాశాల (ఫైల్)

ఎన్‌జీ కళాశాల ప్రతిష్ఠాత్మకమైనది



నేను ఎన్జీ కళాశాల పూర్వ విద్యార్థిని. ఇదే కళాశాలలో డిగ్రీ పూర్తి చేను. ఈ కళాశాలలోనే విద్యాబోధనం చేయడం నాకు ఆనందంగా ఉంది. ఈ కళాశాల ఎంతో ప్రతిష్ఠాత్మకమైనది. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలను ప్రదానం చేస్తున్నాం. ఎంతో మంది పూర్వ విద్యార్థులు అత్యున్నత రంగాలకు ఎదిగారు. ప్రస్తుతం అనేక మంది పూర్వ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. వారందరినీ చూస్తే ఎంతో గర్వంగా ఉంటుంది. కళాశాల ప్లాటినం వేడుకలను విజయవంతం చేయాలి.

– బి.నాగరాజు, అసిస్టెంట్ ప్రొఫెసర్ మైక్రోబయాలజీ, ఎన్జీ కళాశాల

ఎంతో మంది అత్యున్నత స్థానాల్లో ఉన్నారు



ఎన్జీ కళాశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు అత్యున్నత స్థానాలకు ఎదగడం ఎంతో గర్వకారణం. 69సంవత్సరాలు పూర్తి చేసుకుని 70వ వసంతంలోకి అడుగిడుతోంది. ఈ కళాశాలలో చదివిన విద్యార్థులు అమెరికాలోని పోర్ట్‌లాండ్ యూనివర్సిటీలో రీసెర్చ్ స్కాలర్స్‌గా రాణిస్తున్నారు. అది ఎంతో సంతోషించదగ్గ విషయం. ఈకళాశాల తెలంగాణలోనే టాప్-3స్థానంలో ఉంది.

- టి.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కెమిస్ట్రీ, ఎన్జీ కళాశాల

183 దేశాల్లో రాణించడం సంతోషదాయకం



నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన అనేక మంది పూర్వ విద్యార్థులు 183 దేశాల్లో వివిధ రంగాలల్లో పనిచేయడం సంతోషాన్ని ఇస్తోంది. అఖిల భారత సర్వీసుతో పాటు వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణిస్తున్నారు. ఎన్జీ కళాశాల స్థాపన దినోత్సవాన్ని ఈ నెల 22న నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి అయ్యా యి. స్థాపక దినోత్సవంలో బంగారు పతకాల ప్రదానోత్సవానికి ఎంజీయూ ఉపకులపతి అల్తాఫ్ ఖాజా హుస్సేన్‌తో పాటు పలువురు హాజరవుతున్నారు. కార్యక్రమాన్ని విద్యార్థులు విజయవంతం చేయాలి.

- డాక్టర్ సముద్రాల ఉపేందర్, ప్రిన్సిపాల్, ఎన్జీ కళాశాల

అమెరికా పోర్టులాండ్ యూనివర్సిటీలో పూర్వ విద్యార్థులు

అమెరికాలోని ఓరేగాన్ రాష్ట్రంలో ఉన్న అతిపెద్ద పోర్టులాండ్ యూనివర్సిటీలో ఎన్‌జీ కళాశాలలో చదివిన పూర్వ విద్యార్థులు అనేక మంది పీహెచ్‌డీ రీసెర్చ్ స్కాలర్స్‌గా పనిచేస్తూ ఎన్జీ కళాశాల ప్రతిష్టను దేశ విదేశాల్లో నిలబెట్టారని చెప్పవచ్చు. పోర్టులాండ్ నగరంలో ఉన్న ప్రముఖ విశ్వవిద్యాలయం ఈ పోర్టులాండ్ స్టేట్ (పీఎస్‌వో) యూనివర్సిటీ ఇందులో ఎన్జీ కళాశాల పూర్వ విద్యార్థులు రాణిస్తున్నారు. నాగార్జున ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలంగాణ రాష్ట్రంలోనే టాప్ -3 స్థానంలో ఉంది. అడ్మీషన్ల పెరుగుదల విషయంతో పాటు విద్యార్థులు ఉన్నత స్థితికి చేరడం వల్ల కళాశాలకు మంచి స్థానం ఉందని చెప్పవచ్చు. ఈ కళాశాల స్థాపక దినోత్సవానికి ప్రముఖులతో పాటు పూర్వ విద్యార్థులు హాజరు కానున్నారు.

విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంపొందించాలి

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళి

బీబీనగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, వర్చువల్ రియాలిటీ వంటి సౌకర్యాలను కల్పించి విద్యార్థుల్లో సైన్స్ దృక్పథం పెంపొందించేలా కృషి చేయాలని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జీసీఎస్ఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నెలకొల్పిన ఇంటిగ్రేటెడ్ లైబ్రరీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ పుట్టిన గడ్డ, చదువుకున్న పాఠశాలపై మమకారంతో ఇక్కడి విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక ఎన్ఆర్ఐ పాఠశాలలో ఇంటిగ్రేటెడ్ లైబ్రరీని నెలకొల్పడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు ఇక్కడి సైన్స్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతికతపై ఆలోచనలు పెరిగేలా ప్రేరేపించి, వారితో సైన్స్ ప్రయోగాలను చేయించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కమిషన్ చైర్మన్ ఎదుట సైన్స్ ప్రయోగాలు చేయగా తన సెల్‌ఫోన్‌లో వీడియో తీసుకుని విద్యార్థులను అభినందించారు. ఆయన వెంట డీఈవో సత్యనారాయణ, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు గోనారెడ్డి, కీర్తిరెడ్డి, జీసీఎస్ఆర్ ట్రస్టు ప్రతినిధి అరుణ్‌కుమార్, హెచ్ఎం బాలారెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా సువర్ణ పుష్పార్చన, ఊంజల్ సేవోత్సవాలు



లక్ష్మీఅమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



స్వామి దర్శనానంతరం మాడ వీధిలో బెంగాల్ అధికారులు

యాదగిరిగుట్ట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. సుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి అర్చకుల వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 11,05,081 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు. కాగా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రభుత్వ ఆహార, పౌరసరఫరాల అదికారులు ప్రణబ్ బిస్వాస్ (ప్రత్యేక కార్యదర్శి), సుప్రతిమ్, సునయ్ కుమార్‌గోస్వామి, దేబమాల్య బసు స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలోని స్వయంభువులకు ప్రత్యేక పూజలు చేశారు. యాదగిరికొండపై సుమారు (4 నుంచి 6 వరకు) 2 రెండు గంటల పాటు 58.8మిల్లీ మీటర్ల భారీ వర్షం కురిసింది.

సంప్రదాయబద్ధంగా లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లా మట్టపల్లి లక్ష్మీనృసింహుని క్షేత్రంలో శ్రీరాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహుడి నిత్యకల్యాణాన్ని వేదపండితులు శుక్రవారం సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఉదయం హోమాధికాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి బుడ్డోడి ప్రపంచ రికార్డు

● 4.20 నిమిషాల్లో ప్రపంచ దేశాలు, వాటి రాజధానుల పేర్లు
● బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న తారక్ నంద

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణానికి చెందిన ఐదేళ్ల చిన్నారి చావా తారక్ నంద ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రెండోసారి చోటు సాధించాడు. స్థానిక ఆర్‌కే ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ చావా రాజ్‌కుమార్, డాక్టర్ చావా అశ్లేష దంపతుల కుమారుడైన ఒకటో తరగతి చదువుతున్న తారక్ నంద మేలో వీడియో రికార్డింగ్ ఆధారంగా జరిగిన పోటీల్లో ప్రపంచ దేశాలు, వాటి రాజధానుల పేర్లను 4 నిమిషాల 20 సెకన్ల వ్యవధిలో చెప్పి ప్రపంచ రికార్డు సాధించాడు. ఇటీవలి వరకు యూరప్‌కు చెందిన ఐదేళ్ల బాలిక 5 నిమిషాలతో ఉన్న రికార్డులను తారక్ నంద ఛేదించాడు. ఈ మేరకు మూడు రోజుల క్రితం (ఈనెల 15వ తేదీన) ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నిర్వాహకులు వివరాలను వెల్లడించారు. అయితే గతంలోనూ వంద దేశాల పేర్లు, వాటి రాజధానులను అనర్గళంగా చెప్పి ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. ఈ మేరకు ప్రపంచ రికార్డు సృష్టించిన తారక్ నందను కలెక్టర్ ఎం.హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్ యాదవ్ అభినందించారు.



చావా తారక్ నందను అభినందిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, చిత్రంలో తారక్ తల్లిదండ్రులు డాక్టర్ రాజ్‌కుమార్, డాక్టర్ అశ్లేష

సాగునీటిని వృథా చేయొద్దు



నీటిని విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీరేశం

కేతేపల్లి, జూలై 18(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్‌లో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో అందుబాటులోకి వచ్చిన మూసీ సాగునీటిని వృథా చేయవద్దని ఎమ్మెల్యే వేముల వీరేశం ఆయకట్టు రైతులకు సూచించారు. మూసీ ప్రాజెక్టు కుడి ప్రధానకాల్వకు శుక్రవారం ఆయన వానాకాలం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూమూసీ ప్రాజెక్టులో పూడిక తొలగింపుతో పాటు ప్రాజెక్టు అభివృద్ధికి అవసరమైన నిధులు సాధించేందుకు యత్నిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ వెంకటరమణ, మూసీ డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ చైర్‌పర్సన్ మంజుల, తహసీల్దార్ రమాదేవి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఏఈ మధు, ఏఈ మమత, కె.శ్రీనివాసయాదవ్ పాల్గొన్నారు.

రెయిన్‌గేజ్‌ల నిర్వహణ ఇలాగేనా?

● పిచ్చిమొక్కలు, చెట్లకొమ్మన మాటున..
● రక్షణగోడలు లేకపోతే ఎలా?



భువనగిరి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కల మధ్య రెయిన్ గేజ్

భువనగిరి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): పారదర్శకంగా వర్షాపాతాన్ని లెక్కించే రెయిన్ గేజ్‌ను భువనగిరి జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు, చెట్టు కొమ్మల మాటున ఏర్పాటు చేయడంతో వర్షాపాత నమోదులో తారతమ్యాలు జరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. భువనగిరి మండలం నందనం గ్రామ శివారులో ఎలాంటి రక్షణ లేకుం డా రేయిన్ గేజ్ మిషన్ ఏర్పాటు చేయడం, చిన్నారులు రెయిన్ గేజ్ మిషన్ స్తంభాన్ని అటు ఇటు కదిలిస్తుండడంతో వర్షపాత నమోదులో పారదర్శకత ఉండడం లేదు. భవనాలు, చెట్టు లేని విశాలమైన ఖాళీ ప్రదేశాల్లో లేదా ఎత్తైన భవనాల మీద రెయిన్ గేజ్‌లను ఏర్పాటు చేసి రక్షణగా దాని చుట్టూ ఇనుప కంచెను నిర్మించాల్సి ఉండగా మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని నందనం సబ్ స్టేషన్ ఆవరణలో రెయిన్ గేజ్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అయితే రేయిన్ గేజ్ పక్కన పిచ్చి మొక్కలు వేపుగా పెరగడంతో పాటు కార్యాలయానికి వచ్చే ప్రజలు తెలిసీ తెలియక పరిసర ప్రాంతంలో మూత్ర విసర్జన చేస్తున్నారు. అదే విధంగా నందనం శివారులో బహిరంగ ప్రదేశంలో ఎలాంటి ప్రహరీ నిర్మాణం చేపట్టకుండా నిర్లక్ష్యంగా రెయిన్ గేజ్‌ను ఏర్పాటు చేయడం వల్ల పశువులు, కుక్కలు సంచరిస్తు రెయిన్ గేజ్ యంత్రాన్ని కదిలిస్తే వర్షాపాత నమోదులో కొంత మేర మార్పులు చేకూరే అవకాశం ఉందని ప్రజలు పేర్కొంటు న్నారు. రెయిన్ గేజ్ యంత్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశంలో రక్షణగా ప్రహరీ ఏర్పాటు చేసి వర్షపాతం లెక్కించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై మండల సహాయ స్టాటిస్టికల్ అధికారి బాలనర్సింహను వివరణ కోరగా తమ దృష్టికి ఇప్పుడే వచ్చిందని రెయిన్ గేజ్ పరిసరా ప్రాంతాల్లో పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు నందనం శివారులోని రెయిన్ గేజ్ ఏర్పాటు చేసిన స్థలంలో ప్రహరీ నిర్మాణం కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు.



నందనం శివారులో రక్షణగోడ లేకుండా ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్

ప్రహరీ నిర్మించాలి



వర్షపాతాన్ని పారదర్శకంగా లెక్కించేందుకు జిల్లా ప్రణాళిక అధికారులు ఏర్పాటు చేసిన రెయిన్ గేజ్‌ల వద్ద ప్రహరీ నిర్మించాలి. ఎలాంటి రక్షణ లేకపోవడం, పిచ్చి మొక్కలు, చెట్టు కొమ్మలు అడ్డు ఉండడంతో వర్షం పడినప్పుడు వర్షపాత నమోదులో తారతమ్యం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి రెయిన్ గేజ్ చుట్టూ ప్రహరీ నిర్మించాలి.

-కొండాపురం మనోజ్‌కుమార్, నందనం గ్రామం, భువనగిరి మండలం

ఓపెన్ టెన్త్ అడ్మిషన్లు ప్రారంభం

భూదాన్‌పోచంపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): 14 సంవత్సరాలు నిండిన బాలబాలికలు వివిధ కారణాలతో చదువు మధ్యలో మానేసిన వారి కోసం తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ టెన్త్ విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని పాఠశాల హెచ్ఎం రాజారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్ అడ్మిషన్లు ప్రారంభం సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 31 వరకు దరఖాస్తులు అందజే యాలన్నారు.

తుర్కపల్లి ఎంపీడీవోగా గీతారెడ్డి

తుర్కపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి ఎంపీడీఓగా లెంకల గీతారెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో ఝాన్సీలక్ష్మీబాయి ఉద్యోగ విరమణ చేయడంతో ఎంపీవో వెంకటేశ్వర్లుకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలను నిర్వహించారు. మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోగా పని చేస్తున్న లెంకల గీతారెడ్డి బదిలీపై తుర్కపల్లికి వచ్చారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన

ఎంఈవో పాల్వాయి నాగవర్ధన్‌రెడ్డి



ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని ఎంఈవో పాల్వాయి నాగవర్ధన్‌రెడ్డి అన్నారు. పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శుక్రవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలిపారు.

-(ఆంధ్రజ్యోతి-భువనగిరి రూరల్)

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ పాఠశాలలపై ఎలా నమ్మకం కలిగిస్తున్నారు?

ఎంఈవో: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, అన్ని మౌలిక వసతులు ఉన్నాయని ఇక్కడి విద్యార్థుల భవిష్యత్, బాధ్యత తమదేనని విద్యార్థుల తల్లిదండ్రులకు భరోసా కల్పిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలకు పుస్తకాలు అందాయా?

ఎంఈవో: మండలంలోని అన్ని పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌తో పాటు యూనిఫామ్‌లు అందించాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తున్నారా?

ఎంఈవో: ఉపాధ్యాయులు తప్పకుండా సమయ పాలన పాటించాలని పాఠశాలల సమావేశంలో చెబుతున్నాం. అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా.

ఆంధ్రజ్యోతి: మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందిస్తున్నారా?

ఎంఈవో: పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని శుభ్రతతో వండాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ మహిళలను హెచ్చరిస్తున్నాం. తనిఖీలు చేస్తున్నాం. నాణ్యత లేదని తెలిస్తే చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి?

ఎంఈవో: మండలంలో 6 ప్రాథమికోన్నత, 46ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో మొత్తం 3500 మంది విద్యార్థులు చదువుతున్నారు.

చెరువును తలపిస్తున్న రోడ్డు



ముత్తిరెడ్డిగూడెంలోని సెంట్రల్ బ్యాంక్ ఎదురుగా ఉన్న రోడ్డుపై నిలిచిన నీరు

మోటకొండూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో సెంట్రల్ బ్యాంక్ సేవలను వినియోగించుకునేందుకు నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కాని చిన్న పాటి వర్షం పడితే చాలు బ్యాంక్ ఎదురుగా ఉన్న రోడ్డు చెరువును తలపిస్తోంది. వర్షం పడినప్పుడు అటు చాడ గ్రామానికి, సెంట్రల్ బ్యాంక్‌కు వెళ్లాలంటే మురికి నీటిలోంచి నడుచుకుంటూ వెళ్లాల్సిందేనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు నిలవడానికి ప్రధాన కారణం అండర్ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతోనే నీరు నిలుస్తుందని స్థానికులు తెలుపుతున్నారు. అధికారులు స్పందించి వర్షపు నీరు వెళ్లిపోవడానికి అండర్‌డ్రైనేజీ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డుపై గుంతను పూడ్చరేమీ?



చౌటుప్పల్-మునుగోడు రోడ్డుపై ప్రమాదంగా మారిన గుంత

చౌటుప్పల్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రోడ్డు పై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. చౌటుప్పల్ నుంచి మునుగోడుకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో ఈ గుంత ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంగా మారింది. పట్టణంలోని జాతీయ రహదారి నుంచి సుమారు 100 మీటర్ల దూరంలో వారం రోజుల క్రితం వర్షానికి ఏర్పడిన ఈ గుంత రోజు రోజుకూ పెద్దదిగా మారుతునా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎంతో రద్దీగా ఉండే ఈ రోడ్డులోని గుంతలో వాహనాలు పడిపోతున్నాయి. దగ్గరకు వచ్చే వరకూ ఈ గుంత కనిపించక పోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడితున్నారు. ద్విచక్రవాహనాలు ఇప్పటికే ఈ గుంతలో పదుల సంఖ్యలో పడిపోవడంతో వాహనదారులు గాయాలకు గురవుతున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు సీతారాములు

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సీపీఎం దివంగత నాయకుడు మోత్కూరు ప్రకాశంశర్మ పోరాట స్ఫూర్తితో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి పోరాటాలకు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్సీ, సీపీఎం సీనియర్ నాయకుడు చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. శుక్రవారం మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో నిర్వహించిన ప్రకాశంశర్మ 9వ వర్ధంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లౌకిక వాదాన్ని దెబ్బతీస్తూ, మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందదని అన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి అణచివేయ జూస్తోందని అన్నారు. పేదలపై పన్నులు వేస్తూ, కార్పొరేట్ శక్తులకు రాయితీలు ఇస్తోందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వడంలో, స్వామినాథన్ కమిషన్ సిఫారస్సులు అమలు చేయడంలో విఫలమయ్యిందన్నారు. సీపీఎం శాఖ కార్యదర్శి మాండ్ర చంద్రయ్య అధ్యక్షతన జరిగిన సభలో జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మాటూరి బాలరాజు, రిటైర్డు ప్రిన్సిపాల్ ఎం.నరహరిశాస్త్రి, జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు, మద్దెపురం రాజు, రాచకొండ రాములమ్మ, ముత్యాలు, అడ్డగూడూరు మండల కార్యదర్శి బుర్రు అనిల్‌కుమార్, దడిపెల్లి ప్రభాకర్, పైళ్ల యాదిరెడ్డి, చింతల కృష్ణారెడ్డి, పైళ్ల రాంరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీతారాములు

విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామానికి చెందిన కోకబీఆర్ ఫౌండేషన్ చైర్మన్, ఆర్ఎంపీ కోక బిక్షం శుక్రవారం మోత్కూరు అంగడి బజారులోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 162 మందికి వాటర్ బాటిళ్లు అందజేశారు. రానున్న ఆగస్టు 15న విద్యార్థులు పాఠశాలలో మధ్యాహ్నం భోజనం చేయడానికి స్టీలు పళ్లాలు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో హెచ్ఎం బోళ్ల హన్మంతు, ఉపాధ్యాయులు అరుణాదేవి, జి.మల్లేశం, సౌజన్య, లలిత, అండాళమ్మ పాల్గొన్నారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం కోక బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కోక బిక్షం శుక్రవారం నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు దేవాలయంలో వంద మంది భక్తులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి: డీపీవో

గుండాల, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని భువనగిరి డీపీవో సునంద అన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పరిశీలించారు. నిర్మాణాల్లో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలన్నారు. అనంతరం మండలంలోని మాసాన్‌పల్లి గ్రామంలోని బస్టాండ్ నిర్మాణం కోర్టు కేసులో ఉండడంతో ఆ నిర్మాణాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో దేవేందర్ రావు, ఎంపీవో సలీం పాల్గొన్నారు.

మురికి కాల్వ నిర్మాణానికి మరమ్మతులు



వర్షానికి కూలిన మురికి కాల్వను పునర్నిర్మించడానికి కట్టిన బాక్సులు



కూలిన మురికి కాల్వ శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మునిసిపాలిటీలో ఇందిరానగర్ కాలనీకి ఎదురుగా నార్కట్‌పల్లి రోడ్డు వెంట నిర్మించిన మురికి కాల్వ ఈ నెల 17న (గురువారం) కురిసిన ఓ మోస్తరు వర్షానికే కూలడం, ఆ విషయాన్ని పత్రికలు వెలుగులోకి తేవడంతో ఆగమేఘాల మీద కాంట్రాక్టర్ శుక్రవారం కాల్వ పునర్నిర్మాణ పనులు చేపట్టారు. మోత్కూరు ఇందిరా నగర్ కాలనీ ఎదురుగా ఇటీవల మురికి కాల్వ నిర్మించారు. అందులోకి ఇంకా మురికినీరు వదలనే లేదు. గురువారం మోత్కూరులో కురిసిన ఓ మోస్తరు వర్షానికి కాల్వ గోడల వెంట గాతు పూడ్చడానికి పోసిన మట్టి తడిసి సుమారు 80 మీటర్ల పొడవు ఒక పక్క గోడ పూర్తిగా కూలింది. ఈ విషయాన్ని శుక్రవారం పత్రికలు వెలుగులోకి తెచ్చాయి. కాల్వకు ఇంకా బిల్లు కూడా రికార్డు కాలేదని చెబుతున్నారు. కాగా శుక్రవారం ఉదయం ఎక్స్‌కవేటర్‌తో కూలిన గోడ శిథిలాలు తొలగించి, మధ్యాహ్నం బాక్స్‌లు కట్టి తిరిగి గోడ నిర్మించారు. నాణ్యత ప్రమాణాలు పాటించక పోవడంతోనే కొద్ది పాటి వర్షానికే మురికి కాల్వ గోడ కూలి శిథిలమైందని ప్రజలు విమర్శిస్తున్నారు. మునిసిపాలిటీలో రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన మురికి భారీ వర్షాలు కురిస్తే అందులో ఎన్ని ఉంటాయి, ఎన్నికూలుతాయోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఈ విషయాన్ని మునిసిపల్ కమిషనర్ కె.సతీష్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లగా అక్కడ నిర్మించిన మురికి కాల్వకు ఇంకా బిల్లు రికార్డు కాలేదన్నారు. కట్టిన మురికి కాల్వ బిల్లు రికార్డు చేయక ముందే కూడలమేమిటని సంబంధిత ఏఈని పరిశీలించాలనిని చెప్పానన్నారు. ఏఈ ఆదేశాలతో కాంట్రాక్టర్ కాల్వను పునర్నిర్మిస్తుండవచ్చారు.

గొర్రెల మేకల పెంపకందారులను ఆదుకోవాలి

● జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహా

భువనగిరి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకల పెంపకందారుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని వీరవెల్లి, చీమలకొండూరు, ముస్త్యాలపల్లి గ్రామాల్లో గొర్రెల, మేకల పెంపకందారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పెంపకం దారులకు ఎక్స్‌గ్రేషియా, ఇన్సూరెన్స్ తదితర పథకాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో రాయిగిరిలో నిర్వహిస్తున్న జిల్లా 3వ మహాసభను విజయవంతం చేయాలని కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు దేవునూరి బాలయ్య, పాక జహంగీర్, జమదగ్ని, రాజలింగం, యాదగిరి, అయిలయ్య, జహంగీర్, మహేష్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను నెరవేర్చాలి

భువనగిరి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలని భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని బస్వాపురం గ్రామంలో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులతో కలిసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వృద్ధుల, వితంతువులు, గీత, నేత కార్మికులకు నెలకు రూ.4వేల చొప్పున ఆసరా పింఛన్ అమలు చేయడంతో పాటు దివ్యాంగులకు రూ.6వేల పింఛన్ వెంటనే చెల్లించాలన్నారు. ఆగస్టు 13లోగా పింఛన్లు పెంచనట్లయితే అన్ని వర్గాలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తిరగబడతామని హెచ్చరించారు. పింఛన్‌దారుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల జాతీయ ప్రధాన కార్యదర్శి గడ్డం కాసీం, నాయకులు కరుణాకర్, ఉపేందర్, సత్యమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

భువనగిరి @ 230

మునిసిపాలిటీ	మార్కులు	రాష్ట్ర ర్యాంక్	జాతీయ ర్యాంక్
భువనగిరి	7920	33	230
యాదగిరిగుట్ట	6914	68	755
మోత్కూరు	6021	99	1081
ఆలేరు	5866	102	1144
చౌటుప్పల్	5834	104	1033
పోచంపల్లి	4806	128	1525

మార్కుల లెక్కింపు ఇలా..

కేటగిరీ	మార్కులు
వ్యక్తిగత మరుగుదొడ్లు, చెత్తకుప్పలు లేని పట్టణాలు	2500
శుభ్రంగా కనిపించడం	1500
వ్యర్థ పదార్థాల నిర్వహణ	1500
అడ్వకసీ ఫర్ స్వచ్ఛత	1500
చెత్త సేకరణ, కంపోస్టు యార్డుకు తరలింపు	1000
అత్యధిక పారిశుధ్యం	1000
మురుగు నీటి నిర్వహణ	1000
పర్యావరణ వ్యవస్థ బలోపేతం	1000
సెప్టిక్ ట్యాంకుల క్లీనింగ్	500
పారిశుధ్య కార్మికుల సంక్షేమం	500
సిటిజన్ ఫీడ్‌బ్యాక్	500
మొత్తం మార్కులు	12500

(5వ పేజీ తరువాయి)

బృందాలు గుర్తించాయి. అలాగే అభిప్రాయాల వ్యక్తీకరణలో ప్రజల భాగస్వామ్యం స్వల్పంగా ఉండటం కూడా ర్యాంకులు తగ్గడానికి కారణమైందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికైనా పట్టణ పారిశుధ్యంపై అధికారులు శ్రద్ధ చూపాలని, అదే సమయంలో ప్రజలు కూడా తమ వంతు బాధ్యతను నిర్వహించాలని సామాజిక కార్యకర్తలు అంటున్నారు. ఆగస్టు 15న మునిసిపల్ అధికారులకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను అందజేయనున్నారు. 12 కేటగిరీలలో 12500 మార్కులను లెక్కిస్తారు. సాధించిన మార్కుల ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తారు.

విద్యారంగ పరిరక్షణ బాధ్యత ప్రభుత్వాలదే

ఆత్మకూరు(ఎం), జూలై 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మైలారం సత్తయ్య అన్నారు. 2025-2026 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిటిఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.అశోక్‌రెడ్డి, జి.వెంకటనర్సయ్య, టి.జయరావు, అనంతరెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనా రెడ్డి కోరారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలంలో శుక్రవారం ఐదుగురు లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చేక్కులను వారు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, యూత్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, మాజీ ఎంపీటీసీ బద్దం కొండల్ రెడ్డి, నాయకులు మాదగోని శేఖర్, ఊదరి శ్రీనివాస్, వి. సత్తయ్య పాల్గొన్నారు.

సేవలకు చిరునామా రోటరీ క్లబ్



నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేస్తున్న క్లబ్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సేవలకు చిరునామా రోటరీ క్లబ్ అని ఆ క్లబ్ జిల్లా గవర్నర్ డాక్టర్ సోమవరపు రాంప్రసాద్ అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ భువనగిరి నూతన అధ్యక్ష కార్యదర్శులుగా పలుగుల ఆగేశ్వరరావు, తవిటి వెంకటనారాయణ, కోశాధికారిగా ఇటిక్యాల దేవేంద్రచారితో పాటు మిగతా కార్యవర్గంతో ఆయన శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించి మాట్లాడారు. సేవా భావం కలిగిన వారు మాత్రమే రోటరీ క్లబ్ సభ్యత్వానికి అర్హులని అన్నారు. సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో రోటరీ క్లబ్‌లు పోటీపడాలని సూచించారు. త్వరలోనే రెండు వేల మొక్కలు నాటనున్నట్టు తెలిపారు. సేవల్లో జిల్లా పరిధిలో ముందుంటామని నూతన అధ్యక్షుడు అన్నారు. ఈ సందర్భంగా పలువురు నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ దాస జగదీశ్వర్, సహాయ కార్యదర్శి గడ్డం జ్ఞాన ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

నిరాశ్రయుల భవనాన్ని సక్రమంగా నిర్వహించాలి

● కమిషనర్ రామలింగం



నిరాశ్రయుల భవనంలో రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రామలింగం

భువనగిరి టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిరాశ్రయుల భవనాన్ని సక్రమంగా నిర్వహించాలని భువనగిరి మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం అన్నారు. తర్వాత శుక్రవారం ఆయన నిరాశ్రయుల భవనాన్ని పరిశీలించారు. రికార్డులు, నిర్వహణ తీరు, వసతులను తనిఖీ చేశారు. ఆశ్రయం కోసం వచ్చే వారందరినీ ఆదరించాలని, సదుపాయాలను కల్పించాలని అన్నారు. విస్మరిస్తే చర్యలు తీసుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు. డీఈ కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు. కాగా వందరోజుల ప్రణాళికలో భాగంగా 47వ రోజు 3, 4, 8, 10, 15, 16, 18, 23, 26, 31, 3 వ వార్డుల్లో నిర్వహించిన పారిశుధ్య పనులను సానిటరీ ఇన్స్‌పెక్టర్ జాఫర్ అలీ, హెల్త్ అసిస్టెంట్ రజిత తదితరులు పర్యవేక్షించారు.

చేనేత ఐక్యవేదిక ఉపాధ్యక్షుడిగా యాదగిరి

రామన్నపేట, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రామన్నపేట పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు రచ్చ యాదగిరిని తెలంగాణ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షుడిగా, బూరుగు వెంకటేశంను రాష్ట్ర కమిటీ సలహా మండలి సభ్యులుగా నియమిస్తూ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేసి నివేదిక రాష్ట్ర కమిటీకి అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పట్టణ, మండల పద్మశాలి సంఘం నాయకులు వృత్తిదారులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

వర్షం కోసం పెద్దమ్మతల్లికి పూజలు

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల కేంద్రంలో పెద్దమ్మతల్లిని పూజారి పారునంది లక్ష్మణమూర్తి వేప ఆకులతో అలంకరించి వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు కుంకుమ పూజ నిర్వహించారు. వేప ఆకులు చలువనిస్తాయని, వేప ఆకులతో అమ్మవారిని అలంకరించి పూజిస్తే వర్షాలు కురుస్తాయని ఆయన చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు. కాగా శుక్రవారం సాయంత్రం మోత్కూరులో మోస్తరు వర్షం కురిసింది.

'సీసీ రోడ్డు నిర్మించాలి'

చౌటుప్పల్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలోని మద్దెలమ్మ దేవాలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణం చేయించాలని మునిసిపల్ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డిని కమిటీ ప్రతినిదులు కోరారు. ఇటీవల కృష్ణా జలాల పైప్‌లైన్ ఏర్పాటు కోసం కందకం తీశారని, దీంతో సీసీ రోడ్డు ధ్వంసమైందని వారు తెలిపారు. వచ్చే నెల 9 వ తేదీన బోనాల పండుగ ఉందని వారు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో దేవాలయ కమిటీ ప్రతినిదులు గుర్రం నర్సింహ, గోశిక రవి, గోశిక అంజయ్య కర్నాటి శ్రీనివాస్, రుద్ర యాదగిరి లు ఉన్నారు.

పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పద్మశాలి సంఘం మోత్కూరు మండల అధ్యక్షుడు మహేశ్వరం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం మోత్కూరులో నిర్వహించిన సమావేశంలో పట్టణ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోచం బిక్షపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా వేముల నారాయణ, ఉపాధ్యక్షులుగా వంగరి యాదగిరి, చిలుక రాములు, ప్రధాన కార్యదర్శిగా జిల్లా రవీందర్ ఎన్నికయ్యారు.

టీఎన్‌జీవో తాలూకా యూనిట్ కార్యవర్గం ఎన్నిక

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు పీహెచ్‌సీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన టీఎన్‌జీవో తాలూకా యూనిట్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బచ్చు జనార్దన్ (ల్యాబ్ టెక్నీషియన్), ప్రధాన కార్యదర్శిగా పసులేటి వెంకన్న, కోశాధికారిగా రవి, కార్యవర్గ సభ్యులుగా రాములమ్మ, శైలజ, జ్యోతిమేరీ, సిమ్లా ఎన్నికయ్యారు. టీఎన్‌జీవో జిల్లా కార్యదర్శి ఎండి.ఖదీర్, జిల్లా ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు కె.వెంకట రమణారెడ్డి, బోనగిరి సత్యనారాయణ, కోశాధికారి శ్రీనివాస్ ఎన్నికను పర్యవేక్షించారు.

పారిశ్రామిక వాడ కార్యవర్గ సభ్యుడిగా పాటిమట్ల

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాదు చర్లపల్లి పారిశ్రామిక వాడలో చర్లపల్లి నోటిఫైడ్ మునిసిపాలిటీ ఇండస్ట్రియల్ ఏరియా సర్వీస్ సొసైటీ కార్యవర్గ సభ్యునిగా మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామానికి చెందిన రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం చైర్మన్ గోవింద్‌రెడ్డితోపాటు 21 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వారికి కమిషనర్, చైర్మన్‌లు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. పారిశ్రామికవేత్తలు వారిని సన్మానించి అభినందించారు.

పాల సంఘం చైర్మన్‌గా రఘు

అడ్డగూడూరు, జూలై 18(ఆంధ్రజ్యోతి); అడ్డగూడూరు మండలంలోని డీ.రాపాక మదర్ డెయిరీ పాల సంఘం చైర్మన్‌గా బొగిగ రఘు ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల సంఘం బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చిప్పలపల్లి మహేందర్ నాథ్, నాయకులు ఎల్లాంల వీరస్వామి, గూడేపు పరమేష్, గజ్జెల్లి రవి, పోలేపాక అబ్బులు పాల్గొన్నారు.

'వ్యకాస సమావేశాన్ని విజయవంతం చేయాలి'

వలిగొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): బీబీనగర్‌లో 23, 24 తేదీల్లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో కరపత్రం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బిక్షపతి, నాగేష్, సత్తిరెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ బాలకృష్ణ మరణం బీఆర్ఎస్‌కు లోటు



బాలకృష్ణ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

భువనగిరి రూరల్, జూలై 18(ఆంధ్రజ్యోతి): భువనగిరి మండలం కూనూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ డోకె బాలకృష్ణ అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. శుక్రవారం డోకె బాలకృష్ణ మృత దేహం వద్ద పూలమాలతో నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. రెండు పర్యాయాలు సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, పార్టీలో క్రమశిక్షణ కలిగిన నేతగా కొనసాగాడన్నారు. నివాళులర్పించిన వారిలో బీఆర్ఎస్ నేతలు కొలుపుల అమరేందర్, జనగాం పాండు, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, కేశవపట్నం రమేశ్, సుబ్బూరు బీరుమల్లయ్య, నీల ఓంప్రకాశ్, బల్గూరి మధుసూదన్‌రెడ్డి, ఎనబోయిన ఆంజనేయులు, చింతల కిష్టయ్య, అబ్బగాని వెంకట్, కస్తూరి పాండు, వీరేశం, కిష్టయ్య, మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే సామేలు



సీఎంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సామేలు

మోత్కూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైద్రాబాదులోని ఆయన నివాసంలో కలిసి శాలువ కప్పి, పూలబొకే ఇచ్చి సన్మానించారు. రాష్ట్ర వ్యాప్త రేషన్‌కార్డుల పంపిణీకి తిరుమలగిరిలో సభకు అవకాశం ఇచ్చి, వచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సభను సక్సెస్ చేసినందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సామేలును అభినందించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

వలిగొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో జలంధర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని అరూరు, నర్సాయిగూడెం, వెంటాపురం, గురునాథ్‌పల్లి గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ, ఈ వర్షకాలం సీజన్‌లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు రమేష్, మౌనిక, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన నాలా ఆక్రమణ తొలగింపు



నాలా పూడికను తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

చౌటుప్పల్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్ పట్టణంలో నాలా (మురుగు కాలువ) లోని ఆక్రమణలను తొలగించే పనులు రెండో రోజు శుక్రవారం కూడ కొనసాగాయి. మునిసిపల్ కమీషనర్ వెంకట్రామ్ రెడ్డి పర్యవేక్షణలో నాలా సంరక్షణ పనులు సాగుతున్నాయి. చౌటుప్పల్ పట్టణం నుంచి వలిగొండ కు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో కల్వర్టుకు పడమర దిశలో 40అడుగుల వెడల్పు తో 200మీటర్ల పొడవున నాలా ప్రాంతంలో మట్టి తొలగించే పనులు జరుగుతున్నాయి. ఒక వ్యక్తి నాలా స్థలాన్ని కొంత ఆక్రమించి ఇంటి నిర్మాణం చేసుకున్నట్టు స్థానికులు తెలిపారు. కాగా, ఆర్డీవో శేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు నాలా ప్రాంతాన్ని గుర్తించి మట్టిని తొలగిస్తుండడంతో స్థానికుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కాగా, కల్వర్టు దిగువ బాగంలో కబ్జాకు గురైన నాలా స్థలాన్ని తక్షణమే స్వాధీనం చేసుకోవాలని బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పనతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.